క్లుప్తంగా

గిట్టుబాటు ధర కల్పించాలి

చండ్రుగొండ: రైతులు పండించిన అన్ని రకాల పంటలకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు కల్పించాలని సీపీఎం అనుబంధ రైతుసంఘం మండల కార్యదర్శి పెద్దిని వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. నల్లచట్టలను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన మోడీ ప్రభుత్వం ఏడాదికాలం గడిచిన ఆ ఊసే లేదని వేణు విమర్శించారు. మళ్లీ ఆందోళన చేపట్టిన రైతులపై ఢిల్లీలో దాడులు చేస్తూ కేంద్రప్రభుత్వం హక్కులను కాలరాస్తోందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాయి రాజా, నాగుల్‌మీరా, అబ్దుల్ రహిమాన్, బత్తుల నాగేశ్వరరావు, విష్ణు, రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని దురదపాడు గ్రామానికి బంధం సారయ్య, బంధం వెంకటేష్ కలిసి ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం దాచారం గ్రామంలోని తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యక్రమానికి వెళ్లారు. అనంతరం తిరిగి తమ గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో మద్యం మత్తులో అశ్వారావుపేట మండలంలోని కుడుములపాడు వద్ద అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, స్థానికులు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేశారు. కాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఈ సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై శ్రీరాముల శ్రీను ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి ఒలింపియాడ్‌లో ప్రతిభ



పురస్కారం అందుకుంటున్న ఉజ్జయిని

బూర్గంపాడు: ఖమ్మంలో శ్రీనివాస రామానుజం ఫౌండేషన్ ఆధ్వర్యాన ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఒలింపియాడ్‌లో బూర్గంపాడు మండలం సారపాకలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని పీ.వీ.శ్రీ ఉజ్జయిని ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె పురస్కారం అందుకోగా, పలువురు అభినందించారు.

వినతుల వెల్లువ

అశ్వాపురం: మండల కేంద్రంలో ఎంపీపీ ముత్తినేని సుజాత ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై మైనార్టీ నాయకులు మంగళవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దీన్, మండల కోఆప్షన్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.ఖదీర్, మండల కమిటీ అధ్యక్షుడు షేక్.భషీర్, ఏంఏ అజీజ్, అబ్దుల్ రబ్, షేక్ నాగుల్, అన్సారీ, జాన్‌సైదా పాల్గొన్నారు.

సంత స్థలం కోసం..

మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీలో వారాంతపు సంత, వ్యాపార షెడ్లు నిర్మించడానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఎంపీటీసీ కమటం నరేష్, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఎనిమిది గ్రామాల కూడలి మొండికుంట గ్రామం ఉన్నందున సంత కోసం అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

టీజీఓ అధ్యక్షుడి ఎన్నికపై హర్షం

గుండాల: ఖమ్మం జిల్లా నుంచి టీజీఓ రాష్ట్ర సంఘానికి అధ్యక్షుడిగా ఏలూరు శ్రీనివాసరావు ఎన్నికపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మండల పంచాయతీ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తిని శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. మరెన్నో ఉన్నత పదవులు పొందాలని, ఉద్యోగుల న్యాయమైన కోర్కెల సాధనకు కృషి చేస్తారని ఆకాంక్షించారు. తోట తులసి రామ్, దండాల రామారావు, భూపాలపల్లి జిల్లా నాయకులు శ్రీను, నాగరాజు, ఉపేందర్, లక్ష్మయ్య, భూక్య శ్రీను, వలి, గాంధీ, సత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ

మణుగూరురూరల్: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును నూతనంగా బాధ్యతలు చేపట్టిన మణుగూరు డీఎస్పీ వంగ రవీంధర్‌రెడ్డి, సీఐ సోమా సతీష్‌కుమార్‌లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ రవీందర్‌రెడ్డికి, సీఐ సతీష్‌కుమార్‌లకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

ప్రశ్నార్థకంగా మధ్యాహ్న భోజనం

- వర్కర్లకు అందని బిల్లులు
- పెరిగిన ధరలతో అధిక భారం
- కష్టతరంగా మెనూ అమలు



అనంతారం జెడ్పీ పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థినులు



కరకగూడెంలో వంట చేస్తున్న వర్కర్లు

కరకగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై ధరాఘాతం పడుతోంది. కూరగాయలు, నిత్యావసరాల ధరలు నింగినంటడంతో పరిస్థితి తారుమారైంది. వంట నిర్వాహకులు మెనూ ప్రకారం వంట చేయడం కష్టతరమవుతోందని లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఆశయం క్రమంగా నీరుగారుతోంది. వీటికి తోడు మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు గత మూడు నెలలుగా బిల్లులందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో నిర్వాహకులు కిరాణా దుకాణాల్లో అప్పులు చేసి పిల్లల ఆకలి తీర్చుతున్నారు.

మండలంలో సుమారు 50 మంది కార్మికులు ఉండగా వారికి రూ.లక్షల్లో బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఇద్దరు, ముగ్గురు చొప్పున వంట కార్మికులు పని చేస్తున్నారు. ఏజెన్సీకి ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. కూరగాయలు, గుడ్లు, వంట గ్యాస్ తదితరాలను ఏజెన్సీలే సమకూర్చుకోవాలి. వారికి ప్రతి నెలా సకాలంలో బిల్లులు రాకపోవడంతో దుకాణాల్లో ఖాతాలు పెడుతున్నారు.

పొంతనలేని చెల్లింపులు, ఖర్చులు

ప్రాథమిక స్థాయిలో ఒక్కో విద్యార్థికి రూ.5.45, ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు రూ.8.17, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు రూ.10.67 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. ఎనిమిదో తరగతిలోపు విద్యార్థులకు రోజు విడిచి రోజు గుడ్డు అందించేందుకు అదనంగా రూ.5 చొప్పున చెల్లిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన బిల్లులతో పాటు ఏజెంట్లకు గౌరవ వేత నంగా రూ.1000 ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనంగా మరో రూ.2000 అందిస్తోంది. అయితే, గతేడాది సెప్టెంబర్ వరకు ఏజెంట్లకు బిల్లులు ఇచ్చారు. నవంబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు బిల్లుల సొమ్ము జమ కాలేదు.

కొరవడుతున్న పోషకాలు..

గతంలో మ్యాన్యువల్‌గా విద్యార్థుల సంఖ్యను ఉపాధ్యాయులు నమోదు చేసే వారు. ప్రస్తుతం ఆన్లైన్‌లో నమోదు చేస్తుండటంతో లెక్క పక్కాగా ఉంటోంది. ప్రభుత్వం ఇస్తున్న డబ్బులోనే ఏజెన్సీలు అన్ని సర్దుతున్నాయి. కొన్ని పాఠశాలలో ప్రభుత్వం చెల్లిస్తున్న బిల్లుకు.. మెనూ ప్రకారం అందించడం సాధ్యపడడం లేదు. దీంతో భోజనం తయారీలో నిర్దేశిత ప్రమాణాల మేరకు తృణ ధాన్యాలు, పప్పులు, చింతపండు, నూనె, కూరగాయలను సక్రమంగా వినియోగించడం లేదు. ఫలితంగా ఆయా చోట్ల భోజనం రుచి ఉండటం లేదు. పైగా విద్యార్థుల కడుపు నిండుతున్నప్పటికీ పోషక విలువలు అందడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నిత్యావసర సరకులు, కోడిగుడ్లు, కూరగాయలు, కట్టెల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా వంట ఏజెన్సీలకు ఇచ్చే ధరల్లో మార్పు ఉండటం లేదు. ఒక్కో విద్యార్థికి రూ.5 చొప్పున చెల్లించడంతో వారికీ వారానికి మూడు గుడ్లు అందించడం ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులతో పాఠశాలలను సందర్శింపజేసి, మధ్యాహ్న భోజనం అమలు తీరును పక్కాగా సమీక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కాగా 'సాక్షి'ఈ విషయంపై ఎంఈఓ వీరస్వామిని వివరణ కోరగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు త్వరలో చెల్లిస్తామని, మార్కెట్‌లో ధరలు పెరిగినా విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనాలు అందేలా చూస్తున్నామని పేర్కొన్నారు.

చార్జీలు పెంచాలి



గతేడాదితో పోల్చితే ఇప్పుడు నూనెలు, పప్పులు, కూరగాయలు, గుడ్లధరలు పెరిగాయి. ప్రభుత్వం అందించే బిల్లులు ఎటూ సరిపోవడం లేదు. అప్పు చేసి మరీ విద్యార్థులకు భోజనాలు అందిస్తున్నాం. పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలి. అప్పుడే కాస్త గిట్టుబాటు అవుతుంది. తక్షణమే ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించాలి.

– గొగ్గలి భద్రకళ, వంట నిర్వాహకురాలు, కరకగూడెం జెడ్పీ పాఠశాల

సరుకులు సరఫరా చేయాలి..



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి పెడితే నష్టాలే వస్తున్నాయి. కిరాణ, గుడ్లు, కూరగాయల డబ్బులు, జీతం నాలుగైదు నెలలకోసారి జమ అవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీలు, గురుకులాలు, వసతి గృహాల మాదిరిగా సరుకులు, కూరగాయలు, ఎల్పీజీ సిలిండర్లు ప్రభుత్వమే సరఫరా చేసి ప్రతి నెలా గౌరవ వేతనాలు చెల్లించాలి.

– మామిడాల అమ్మక్క, వంట నిర్వాహకురాలు, భట్టుపల్లి జెడ్పీ పాఠశాల

అధికారులు చొరవ చూపాలి



మధ్యాహ్న భోజన ధరలు పెంచితేనే ఏజెన్సీ నిర్వాహకులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ విషయంలో అధికారులు చొరవచూపి ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలి. ప్రతి నెలా సకాలంలో బిల్లులు చెల్లించాలి. ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున చెల్లిస్తే బాగుంటుంది. మార్కెట్లో గుడ్డు ధర పెరిగినందున రూ.7 చొప్పున చెల్లించాలి. ప్రమాద బీమా తదితర సౌకర్యాలు కల్పించాలి.

– కొమరం కాంతారావు, సీఐటీయూ నాయకుడు, కరకగూడెం

సేవాలాల్ సమాజ సేవకుడు



జాతీయ రహదారిపై ప్రదర్శన నిర్వహిస్తున్న లంబాడా గిరిజనులు, పాల్గొన్న ఎమ్మెల్యే జారే



అశ్వాపురం: వేడుకల్లో ఎమ్మెల్యే పాయం, బ్రహ్మయ్య, డాక్టర్ శంకర్‌నాయక్ తదితరులు

అశ్వాపురం: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ గొప్ప సమాజ సేవకుడని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పినపాక నియోజకవర్గ స్థాయిలో అధికారికంగా మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భోగ్‌బండారా కార్యక్రమంలో ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు, బంజారా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అశ్వాపురంలో సంత్ సేవాలాల్ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. సంత్ సేవాలాల్ బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా సిద్ధాంతానికి పునాదులు వేశారన్నారు. గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్, జిల్లా, మండల కోఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దీన్, ఎస్‌కే.ఖదీర్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నాయకుడు డాక్టర్ శంకర్‌నాయక్, సదర్ లాల్, సేవాలాల్‌సేన, బంజారా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: లంబాడ గిరిజనుల ఆరాధ్యదైవమైన సద్గురు సేవాలాల్ మహరాజ్ ఆశయాలను నెరవేర్చే దిశగా లంబాడాలు జీవనం సాగించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండల కేంద్రం చండ్రుగొండలో మంగళవారం సేవాలాల్ జయంతి ఉత్సవం నియోజకవర్గస్థాయిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ.. అన్ని కులాల, మతాల సారాంశం ఒకటేనన్నారు. ఆ మహనీయుడి ఆశయాల సాధన కోసం లంబాడా గిరిజనులు కృషి చేయాలన్నారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి ప్రధాన సెంటర్ మీదుగా ఉత్సవ వేదిక వరకు పెద్ద ఎత్తున మహిళలతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సేవాలాల్ చిత్రపటం ఎదుట పూజలు జరిపించారు. కార్యక్రమంలో నాయకులు ఎంపీపీ బాణోత్ పార్వతి, వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, భోజ్యానాయక్, మాజీ ఎంపీపీలు గుగులోతు బాబు, గుగులోతు మీన, వీరన్న నాయక్, బాబులాల్, మోహన్‌నాయక్, గుగులోతు చందర్, సేవ్యా పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలి

కరకగూడెం: మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం నూతన ఆర్టీసీ బస్టాండు నిర్మించాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు మంగళవారం మణుగూరులోని డిపో కార్యాలయంలో ఓ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. మండలవాసులు ప్రతీ రోజు వందల సంఖ్యలో మండల కేంద్రానికి వస్తుంటారని, ఈ క్రమంలో ప్రయాణికులు బస్సు ఎక్కడం కోసం బస్టాండ్ సౌకర్యం లేక చెట్ల కింద షాపుల ఎదుట నిల్చుని పడిగాపులు కాస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తక్షణమే చొరవచూపి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఊకే నరసింహారావు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీ వలస ఆదివాసీ గ్రామాల్లో సీఐ సతీష్‌కుమార్ మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని పగిడేరు, ఎస్టీకాలనీ, విప్పలగుంపు గ్రామాల్లో ఆయన ఎక్సైజ్ అధికారులతో కలిసి పర్యటిస్తూ.. పలువురి ఇళ్లను తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ.. నాటుసారా తయారీ, విక్రయాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నాటుసారా తాగడం వల్ల అనారోగ్యాలకు గురవ్వడమే కాకుండా ప్రాణాలు సైతం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. నాటుసారా తయారీ, విక్రయాల చేయొద్దని సూచించారు. ఎవరైనా ఇందుకు విరుద్ధంగా సారా తయారు చేసినా, విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై కిషోర్‌బాబు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కరకగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న 14 పోలింగ్ కేంద్రాలను మండల తహసీల్దార్ చందా నరేష్ మంగళవారం సందర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో కరెంట్, ఫర్నిచర్, నీటి వసతి, మూత్రశాలలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపుల వంటి సౌకర్యాలను పరిశీలించారు. దాదాపు అన్ని చోట్ల వసతులు బాగానే ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం ఆర్ఐ షేక్ హుస్సేన్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టేషనరీ వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఇదే పాఠశాలలో 1990–91లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ప్యాడ్, పెన్ను, పెన్సిల్ వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. ఇష్టంగా కష్టపడి చదివి వంద శాతం ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కుంట మల్లారెడ్డి, రవీంద్రాచారి, సురకంటి ప్రభాకర్‌రెడ్డి, కొల్లు రవి, గొడుగు వెంకన్న, కమటం ఆంజనేయులు, మామిడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్



విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందిస్తున్న ఎంఈఓ సమ్మయ్య

భద్రాచలంటౌన్: భద్రాచలం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి సున్నం సమయ్య హాజరై ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్న వేళ విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం, వారిలోని భయాన్ని తగ్గించేందుకు ఈ టాలెంట్ టెస్టులు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భూపేందర్, సందీప్, రవీందర్, కార్తీక్, అరవింద్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న దాసాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం భీష్మ ఏకాదశి, దాసాంజనేయ స్వామి ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు భీష్మాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, సింధూర లేపనం అనంతరం అష్టోత్తర సహస్రనామార్చన మొదలగు పూజా కార్యక్రమం జరిపారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం, భీష్మ ఏకాదశి విష్ణు సహస్ర నామ పారాయణం, లక్ష్మీ పారాయణం జరిపారు. కార్యక్రమంలో టీటీడీ మండల ప్రచారక్ పిలకా నాగేంద్రరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం

ములకలపల్లి: మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. వైస్ ఎంపీపీ కొదుమూరి పుల్లారావు అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జనరల్‌బాడీ ఏర్పాటు చేశారు. పలుశాఖల అధికారులు పాల్గొని తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కాగా సగానికిపైగా శాఖల మండల అధికారులు సమావేశానికి గైర్హాజరవడంపై కోఆప్షన్ సభ్యుడు జబ్బార్, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకోకసారి నిర్వహించే సభకు అధికారులు రాకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. హాజరుకాని అధికారులపై చర్యలకు సిఫారసు చేస్తూ.. ఉన్నతాధికారులకు నివేదించాలని కోరారు. సమావేశానికి ఎంపీపీ మట్ల నాగమణి, జెడ్పీటీసీ సున్నం నాగమణి సైతం గైర్హాజరవడం గమనార్హం. ఎంపీడీఓ భారతి, ఈఓఆర్డీ లక్ష్మయ్య, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

యాత్రలో పాల్గొనండి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఈ నెల 25న బీజేపీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని క్లస్టర్ ఇన్‌చార్జ్ మార్తినేని ధర్మారావు కోరారు. పట్టణంలోని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మా నివాసంలో మంగళవారం జరిగిన విజయ సంకల్ప యాత్ర సన్నాహక సమావేశంలో ధర్మారావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చాడా శ్రీనివాసరావు, రంగా కిరణ్, గల్లా సత్యనారాయణ, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, క్రాంతి కుమార్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి

మణుగూరురూరల్: ఉపాధి కూలీల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బొల్లం రాజు, సత్రపల్లి సాంబశివరావులు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మండలంలోని గుట్టమల్లారంలోని కారం వెంకటయ్య కుంటలో పని చేస్తున్న ఉపాధి కూలీలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు సరైన వసతి సదుపాయాలు కల్పించకపోవడం, పరికరాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచి రోజుకు కూలీ రూ.600 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వేతనాలను కూలీల ఖాతాల్లో జమ చేయాలన్నారు. హనుమంతరావు, కూలీలు అనుపమ, ఎస్ మని, పుష్ప, వెంకటరమణ, లక్ష్మణ్, సాహెబ్ బేగం, రామారావు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల హెచ్‌ఎం ఏవీ రామారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. దుమ్ముగూడెం పాఠశాలలో 40 సంవత్సరాలుగా పదో తరగతి పరీక్షా కేంద్రం నిర్వహిస్తూ.. గత సంవత్సరం నుంచి ఎత్తివేయడాన్ని నిరసించారు. ప్రస్తుత సంవత్సరం పరీక్ష కేంద్రాన్ని ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు ముసలి, రాంబాబు, షేక్ హుస్సేన్ అహ్మద్, సరిత, నక్క,సత్యనారాయణ, గ్రామ పెద్దలు కొత్తూరి సీతారామారావు, బైరెడ్డి సతీష్, బిల్లకుర్తి నగేష్, ఖన్నా, నర్సింహారావు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల పరామర్శ



బండి పుల్లారావును పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఓ కుటుంబాన్ని పరామర్శించారు. మండలంలోని నారంవారిగూడేనికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు బండి పుల్లారావు కొద్ది నెలల క్రితం కంటి సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని, ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటుండగా.. మంత్రి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. పుల్లారావు ఆరోగ్యం, ఇతర వివరాలను తెలుసుకున్నారు. రామచంద్రప్రసాద్, దమ్మపేట సొసైటీ చైర్మన్ వి.రాఘవులు, దొడ్డా ప్రసాద్, నున్న రత్నకర్, రసూల్, బండి భాస్కర్, యర్రా వసంతం, వేములపల్లి రామకృష్ణ, ముళ్లపూడి చలపతి, నార్లపాటి రాములు, డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

నేటి నుంచి మినీ మేడారం



మణుగూరుటౌన్: తోగ్గూడెం మినీ మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయం



చర్ల: ఎదిరగుట్టల్లో ముస్తాబైన సమ్మక్క సారలమ్మ దేవాలయం



మణుగూరుటౌన్: అన్నదానానికి వాసవీక్లబ్ ఆధ్వర్యాన చేస్తున్న ఏర్పాట్లు..

మణుగూరుటౌన్: మండలంలోని తోగ్గూడెం వైభవంగా నిర్వహించే మినీ మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు దశాబ్దాలకు పైగా తోగ్గూడెంలో జాతర జరుగుతుండగా, ములుగు జిల్లా మేడారం వెళ్లలేని భక్తులు ఇక్కడ మొక్కులు చెల్లించుకుంటారు. ఈ మేరకు గ్రామపంచాయతీ ఆధ్వర్యాన ఏటా సుంకు జాతరతో పాటు రెండేళ్లకోసారి సమ్మక్క–సారలమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తారు. ఈసారి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాలతో మరింత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సిద్ధమయ్యారు. సింగరేణి ఆధ్వర్యాన భారీ సంఖ్యలో లైట్లు ఏర్పాటుచేయగా, తాగునీటి వసతి కల్పించారు. కాగా, బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క దేవత గద్దెలపైకి రానుండగా, శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం శనివారం అమ్మవార్లు వన ప్రవేశం చేశాక జాతర ముగియనుంది. జాతరకు వచ్చే వేలాది మంది భక్తులకు మణుగూరు వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘాలు, దోసపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన సింగరేణి, అటవీ అధికారుల సహకారంతో మూడు రోజుల పాటు ఉచిత అన్న ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ఇక ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురు కాకుండా బందోబస్తును సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ రాజేశ్ పర్యవేక్షించనున్నారు.

ఎదిరగుట్టల్లో ఏర్పాట్లు పూర్తి..

చర్ల: మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన ఎదిరగుట్టల్లోని సమ్మక్క సారలమ్మ దేవాలయం వద్ద సుంకు జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతీ రెండేళ్లకోసారి చర్ల మండలంలోని సుబ్బంపేట గ్రామపంచాయితీలో ఉన్న ఈ ఎదిరగుట్టల్లో సమ్మక్క సారలమ్మ జాతర కొనసాగుతుండగా.. ఈ సంవత్సరం 21 నుంచి 24 వరకు సుంకు జాతర కొనసాగనున్నది. మేడారంలో జాతర కొనసాగే సంవత్సరమే ఇక్కడ సుంకు జాతర కొనసాగడం, ఇక్కడ మెయిన్ జాతర కొనసాగే సంవత్సర మేడారంలో సుంకు జాతర కొనసాగడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం ఎదిర గుట్టల సమ్మక్క సారలమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షుడు వాసం ముసలయ్య, ఆలయ పూజారి పూనెం సమ్మయ్య నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మేడారం వెళ్లలేనివారు ఇక్కడ అమ్మవార్లను దర్శించుకోనున్నారు.